సాక్షి
వికారాబాద్

శుక్రవారం ၊ 3 ၊ మార్చి ၊ 2023



'ట్రేడ్' మాయాజాలం
మున్సిపల్ శాఖ ఆదాయ వనరులను విస్మరిస్తుండడంతో లక్షలాది రూపాయల ఆదాయాన్ని కోల్పోతోంది. 8లో▸



ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. 8లో▸



జీపీలపై చిన్నచూపు!
ప్రభుత్వం ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతివనం నిర్మించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు కృషి చేస్తోంది. 9లో▸

న్యూస్‌రీల్

రేపు ఎథిక్స్, 6న ఎన్విరాన్మెంటల్ పరీక్షలు

వికారాబాద్ అర్బన్: ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు శనివారం నిర్వహించే ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్షకు తప్పకుండా హాజరు కావాలని ఇంటర్ నోడల్ అధికారి ఎస్.శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 6న ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎగ్జామ్ కొనసాగుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 7,857 మంది జనరల్, 1,374 మంది ఒకేషనల్ విద్యార్థులు హాజరు కానున్నట్లు స్పష్టంచేశారు. ఈ పరీక్షలకు హాజరు కాకపోతే థియరీ ఎగ్జామ్స్ రాసి పాసైనా.. ఫెయిల్‌గానే పరిగణిస్తారని తెలిపారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా విజయలక్ష్మి పండిట్



అనంతగిరి: సీపీఐ జిల్లా కార్యదర్శిగా విజయలక్ష్మి పండిట్ నియమితులయ్యారు. గురువారం సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో వికారాబాద్ జిల్లా సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విజయలక్ష్మిని జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తనను జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్న జిల్లా సమితికి, సహకరించిన రాష్ట్ర పార్టీ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాలమల్లేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కుక్కలను చూసి పరుగు తీయొద్దు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

వికారాబాద్ అర్బన్: వీధి కుక్కల దాడులపై మెప్మా రిసోర్స్ పర్సన్స్ మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర తెలిపారు. మున్సిపల్ ఆఫీసులో గురువారం మెప్మా రిసోర్స్ పర్సన్లకు అవగాహన కల్పించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. కుక్కల దాడి నుంచి ఎలా రక్షించుకోవాలనే అంశంపై వార్డుల్లో నిర్వహించే మహిళా సంఘాల సమావేశాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కుక్కలను చూసి భయపడి పరుగెత్తే ప్రయత్నం చేయొద్దని, వేగంగా నడవకూడదని వివరించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మొయినొద్దీన్, టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చేదిన్ పోయి.. సచ్చేదిన్ వచ్చె..



మీర్‌పేటలో మంత్రి నిరసన

మీర్‌పేట: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అచ్చేదిన్ పోయి.. సచ్చేదిన్ వచ్చాయని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఎద్దేవా చేశారు. గ్యాస్ సిలిండర్‌పై రూ.50 అదనపు పెంపును నిరసిస్తూ గురువారం జిల్లెలగూడ చందన చెరువు కట్ట నుంచి మీర్‌పేట కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మహిళా నేతలతో కలిసి కట్టెల మోపు ఎత్తుకుని వినూత్న తరహాలో నిరసన తెలిపారు.

క్రీడల్ నిల్!

భూమి చదును పనులకే పరిమితమైన క్రీడా ప్రాంగణాలు

- మెజార్టీ గ్రామాల్లో బోర్డులు ఏర్పాటు చేసి వదిలేసిన వైనం
- ఆట వస్తువుల ఏర్పాటుకు నిధుల కొరత
- ఆందోళనలో విద్యార్థులు, యువత



పూడూరులో బోర్డు ఏర్పాటు చేసి వదిలేసిన క్రీడా మైదానం

వికారాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్రీడా ప్రాంగణాల అభివృద్ధి కేవలం భూమి చదును, బోర్డుల ఏర్పాటుకే పరిమితమవుతోంది. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఇవి పూర్తిస్థాయిలో ఆటలకు అనువుగా మారలేదు. పలుచోట్ల వివాదాల కారణంగా ఇప్పటికీ భూముల గుర్తింపు సైతం పూర్తి కాలేదు. గ్రామీణ ప్రాంతాల్లో మెరికల్లాంటి క్రీడాకారులు ఉన్నప్పటికీ క్రీడా ప్రాంగణాలు, మౌలిక సదుపాయాలు కరువై వారి ప్రతిభ మసకబారుతోంది. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం గ్రామానికో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ బాధ్యతలను కలెక్టర్లకు అప్పగించడంతో ఏడాది కాలంగా ఇందుకు కసరత్తు జరుగుతోంది. వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనాల తరహాలో ఆట స్థలాల అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో 90శాతం క్రీడా ప్రాంగణాలు పూర్తయ్యాయి. స్థలం దొరకటం కష్టంగా ఉన్న గ్రామాలు మినహా మెజార్టీ చోట్ల గ్రౌండ్లు ఒక రూపాన్ని సంతరించుకున్నాయి. అయితే చాలా పంచాయతీల్లో కేవలం అర ఎకరం, ఎకరం స్థలంలోనే ఏర్పాటు చేశారు. మూడు నాలుగు గ్రామాలకు కలిపి ఒక చోట కనీసం మూడెకరాల స్థలంలో క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధి చేస్తే బాగుండేదని యువత, విద్యార్థులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా క్రీడా ప్రాంగణాల్లో ఆట వస్తువులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రాలేదు.

ప్రతి జీపీలో క్రీడా ప్రాంగణం

జిల్లాలో 566 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతీ జీపీలో ఒకటి చొప్పున 566 క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం ఒక్కో గ్రౌండ్‌కు సుమారు 2వేల చదరపు గజాలు లేదా 20 గుంటల భూమికి తగ్గకుండా కేటాయించాలని అన్ని మండలాల తహసీల్దార్లకు కలెక్టర్ నుంచి ఆదేశాలు అందాయి. గ్రామ సమీపంలోని ప్రభుత్వ, ఫారెస్టు భూములను సేకరించాలని సూచించారు. సర్కారు స్థలాలు అందుబాటులో లేని గ్రామాల్లో.. జీపీల్లో వెలిసే లే అవుట్లలో సామాజిక అవసరాల కింద ఇచ్చే పది శాతం భూమిని క్రీడా ప్రాంగణాల కోసం గుర్తించే వీలు కల్పించారు.

తొంభై శాతం పనులు పూర్తి

జిల్లాలో ఇప్పటి వరకు 541 జీపీల్లో క్రీడా ప్రాంగణాల కోసం స్థలాలను గుర్తించారు. ఇందులో 332 చోట్ల క్రీడా ప్రాంగణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. మరో 70 పురోగతిలో ఉన్నాయి. 29 పంచాయతీల్లో స్థల సేకరణ చేపట్టాల్సి ఉంది. అయితే గ్రామ సమీపంలో స్థలాలు గుర్తించాలని ప్రభుత్వం సూచించడం తహసీల్దార్లకు ఇబ్బందులు తెచ్చి పెడుతోంది. గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను ఇప్పటికే పల్లె ప్రకృతి వనాలు, పాఠశాలలు, జీపీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వైకుంఠ ధామాలు తదితర అవసరాలకు కేటాయించారు. ప్రస్తుతం స్థలాల లభ్యత కష్టంగా మారిన తరుణంలో సుమారు 20 జీపీల్లో క్రీడా ప్రాంగణాల గుర్తింపు తహసీల్దార్లకు సంకటంగా మారింది. భూమి ఉన్న చోటమౌలిక వసతులు కల్పించి, ఆట సామగ్రి అందుబాటులో ఉంచాలని యువత, క్రీడాకారులు కోరుతున్నారు.

ద్విముఖ వ్యూహం

- ఇటు కేడర్ బలోపేతం.. అటు అభ్యర్థుల వేట
- నియోజకవర్గాల్లో పట్టుకోసం బీజేపీ నేతల కార్యాచరణ
- ప్రజా సమస్యలపై పోరాటాలకు ప్రత్యేక ప్రణాళిక
- సాధ్యమైనంత త్వరగా గెలుపు గుర్రాలను ఎంచుకోవాలని నిర్ణయం



వికారాబాద్: జిల్లాలో పార్టీ బలోపేతానికి కమలదళం ద్విముఖ వ్యూహాన్ని అమలు చేస్తోంది. క్షేత్రస్థాయిలో కేడర్‌ను బలోపేతం చేస్తూనే ఆయా నియోజకవర్గాల్లో సమర్థులైన అభ్యర్థుల కోసం వేట సాగిస్తోంది. ఇందులో భాగంగానే అధిష్టానం పిలుపు మేరకు బీజేపీ నేతలు 'ప్రజల గోస.. బీజేపీ భరోసా' కార్యక్రమంతో జనక్షేత్రంలోకి వెళ్లారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూనే.. కేసీఆర్ విస్మరించిన హామీలపై విమర్శలు చేస్తున్నారు. మూడు నుంచి ఐదు బూత్‌లకు ఒకచోట కార్నర్ మీటింగ్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు. అయితే జిల్లా నేతలు, కేడర్ మధ్య సమన్వయం లేకపోవడం పార్టీకి తలనొప్పిగా మారింది. కార్యకర్తలు, శ్రేణులను సమన్వయం చేసే విషయంలో జిల్లా నాయకత్వం విఫలమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అభ్యర్థుల కోసం కసరత్తు

జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో కేవలం వికారాబాద్‌లో మాత్రమే బీజేపీ తరఫున పోటీ చేసేందుకు గట్టి నాయకుడు ఉండగా.. మిగిలిన మూడు చోట్ల అభ్యర్థులు ఎవరనే అంశంపై ఇప్పటికీ స్పష్టత లేదు. తాండూరులో బీజేపీ నేతలు కొంతకాలంగా ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డితో సంప్రదింపులు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నా.. ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు. దీంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్ల దిశగా పార్టీ నేతలు దృష్టిసారించారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణకు అవకాశం రావచ్చనే చర్చ సాగుతోంది.

పరిగి నుంచి భాస్కరయోగి..?

పరిగి నియోజకవర్గం నుంచి కమలం పార్టీ తరఫున ఎవరిని రంగంలోకి దింపుతారనే విషయం ఇటీవల ఎక్కువగా చర్చనీయాంశమైంది. ఇక్కడ సీనియర్ నేత కరణం ప్రహ్లాద్‌రావు, పరమేశ్వర్‌రెడ్డి, కిరణ్ తదితరులు పోటీ పడుతుండగా.. అధిష్టానం పరిశీలనలో భాస్కరయోగి పేరు సైతం ఉన్నట్లు తెలుస్తోంది. టీఆర్ఎస్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఉండగా.. డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి అధికార పార్టీ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వీరిలో టికెట్ దక్కని నేతను తమవైపు తిప్పుకోవాలనే అంశాన్ని కమలనాథులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే చివరి నిమిషం వరకు వేచిచూడకుండా పార్టీ అభ్యర్థిని ముందస్తుగానే రంగంలోకి దింపాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

అప్పు కడతారా.. తాళం వేయమంటారా?



పెద్దేముల్ మండలం గొట్లపల్లిలో అప్పు చెల్లించాలని రైతు ఇంటి ముందు కూర్చున్న బ్యాంకు అధికారులు

- బ్యాంకు అధికారుల ఒత్తిడి
- లేదంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిక
- రైతు ఇంటి ఎదుట గంటల తరబడి తిష్ట

పెద్దేముల్: అప్పు కడతారా.. ఇంటికి తాళం వేయమంటారా? అంటూ బ్యాంకు అధికారులను తనను ఇబ్బందులకు గురిచేశారని, లేదంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామంటూ హెచ్చరించారని ఓ రైతు ఆవేదన వ్యక్తంచేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. పెద్దేముల్ మండలం గొట్లపల్లికి చెందిన రైతు మక్తలయ్యకు ఇరవై ఏళ్ల క్రితం ప్రభుత్వం 3.13 గుంటల అసైన్డ్ భూమిని పంపిణీ చేసింది. ఇందుకు సంబంధించి పత్రాలు పెట్టి తాండూరులోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో (2013) రూ.1.36 లక్షల పంట రుణం తీసుకున్నాడు. ఈ మొత్తం ప్రస్తుతం రూ.2.15 లక్షలకు చేరింది. అంతేగాకుండా 2014లో రీ షెడ్యూల్ రుణం కింద మరో రూ.50 వేలు తీసుకున్నాడు. ఈ మొత్తం రూ.80 వేలకు పెరిగింది. దీంతో అప్పు చెల్లించాలంటూ బ్యాంకు అధికారులు పలుమార్లు అతనికి నోటీసులు జారీ చేశారు. అయితే ప్రభుత్వం నుంచి లక్ష రూపాయల మాఫీ వర్తిస్తుందనే ఆశతో ఉన్న రైతు అప్పు చెల్లించకుండా జాప్యం చేశాడు. ఈ మొత్తం రెండింతలు కావడంతో బ్యాంకు అధికారులు రంగంలోకి దిగారు. గురువారం బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు, రికవరీ అధికారి జయన్న, ఫీల్డ్ అధికారి రమేశ్ తదితరులు రమేశ్ ఇంటికి వెళ్లి అప్పు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉదయం 10:30 నుంచి ఒంటి గంట వరకు అక్కడే తిష్టవేశారు. రైతు మాత్రం మూడేళ్లుగా భారీ వర్షాలతో పంటలు పాడయ్యాయని, కనీసం పెట్టుబడులు కూడా రాకపోవడంతో పూట గడవని పరిస్థితి నెలకొందని చెప్పుకొచ్చాడు. అయితే కనీసం రూ.15 వేలైనా చెల్లించాలని బ్యాంకు అధికారులు పట్టుబట్టారు. ఇంట్లో పరిశీలించగా ధాన్యం, పత్తి వంటివి కనిపించకపోవడంతో డబ్బులు కడుతారా.. లేదా ఇంటికి తాళం వేయమంటారా..? అని ప్రశ్నించారు. ఇంటి ఎదుట ఉన్న మేకలను అమ్మి రుణం తీర్చాలని, లేదంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. దీంతో ఏం చేయాలో తోచని రైతు తన కొడుకు సురేశ్‌కు ఫోన్ చేసి విషయం చెప్పాడు. యాలాల మండలం బెన్నూర్ గ్రామంలో సెంట్రింగ్ పనులకోసం వెళ్లిన సురేశ్ తాను పని చేస్తున్న చోట రూ.5 వేలు అప్పు చేసి బ్యాంకులో చెల్లించాడు. ఈ విషయమై మీడియా ప్రతినిధులు బ్యాంకు అధికారులను అడగగా తాము రుణం చెల్లించమని మాత్రమే అడిగామని, ఇంటికి తాళం వేస్తామని అనలేదని తెలిపారు. రైతు ముక్తలయ్యను సంప్రదించగా తనకు పంట రుణం కింద రూ.1.36 లక్షలు మాత్రమే చెల్లించారని, రీ షెడ్యూల్ కింద రుణం ఇస్తామని సంతకం తీసుకొని రూ.50 వేలు చెల్లించలేదని, సుమారు ఏడాది నుంచి రూ.50 వేల కోసం పోరాడుతున్న బ్యాంకు అధికారులు తనకు న్యాయం చేయడం లేదని వాపోయాడు.

అత్యాశకు పోతే అసలుకే ఎసరు

- రూ.లక్ష డిపాజిట్ చేస్తే మూడేళ్లు నెలకు రూ.9 వేలు జమ చేస్తామని ప్రకటన
- అధిక వడ్డీ ఆశతో జిల్లాలో రూ.35 కోట్లకు పైగా డిపాజిట్
- మోసపోయామని గుర్తించి పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- వీరిలో ప్రభుత్వ ఉద్యోగులు సైతం..



సీఐ లింగయ్యకు ఫిర్యాదు చేస్తున్న యాచారం బాధితులు

యాచారం: ఆన్‌లైన్ మార్కెటింగ్ వలలో చిక్కుకొని బాధితులు విలవిల్లాడుతున్నారు. అధిక వడ్డీ వస్తుందని అత్యాశకు పోయి నిండా మునిగారు. వీరిలో ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉండటం గమనార్హం. రూ.35 కోట్లకు పైగా మోసపోయామని 50 మంది బాధితులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. ఢిల్లీ కేంద్రంగా ఈ-స్టోర్ ఇండియా, కేపీడబ్ల్యూ కంపెనీ అనే ప్రైవేట్ వ్యాపార సంస్థలు ఆన్‌లైన్ మార్కెటింగ్ నిర్వహిస్తున్నాయి. రూ.లక్ష డిపాజిట్ చేస్తే నెలకు రూ.9 వేల చొప్పున 36 నెలల పాటు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించాయి. అసలు రూ.లక్షతో పాటు అదనంగా రూ.2,24,000 వస్తాయన్న మాట. రెండేళ్ల క్రితం ప్రారంభమైన ఈ సంస్థలు మొదట రూ.లక్ష డిపాజిట్ చేసిన వారికి ఆరు నెలల పాటు నెలకు రూ.9 వేల చొప్పున జమ చేసి నమ్మబలికాయి. దీంతో అత్యాశకు పోయి జనం ఎగబడ్డారు. ఢిల్లీ కేంద్రంగా జరిగే ఈ వ్యవహారాలను యాచారం గ్రామానికి చెందిన ఎండీ సోఫియాన్, ఎండీ ఉమ్మాన్, ఎండీ ఫర్‌హాన్, మహేశ్వరం గ్రామానికి చెందిన ఎండీ సమద్, మొగిలిగిద్దకు చెందిన ఎండీ యూసుఫ్, హైదరాబాద్‌కు చెందిన ఎండీ అజహర్ పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలోని యాచారం, కందుకూరు, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన వందలాది మంది జనం వీరి మాటలను నమ్మి ఈ రెండు సంస్థల ఖాతాల్లో లక్షలాది రూపాయలు డిపాజిట్ చేశారు. అప్పులు చేసి, బంగారు నగలు తాకట్టు పెట్టి, బ్యాంకు రుణాలు తెచ్చి, పిల్లల పెళ్లిళ్ల కోసం దాచి పెట్టిన డబ్బులన్నీ ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో పెట్టారు. ఏడు నెలల నుంచి వీరి ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదు. చివరకు తాము మోసపోయామని తెలుసుకొని బాధితులు లబోదిబోమంటున్నారు.

బాధితుల్లో ఉద్యోగులు సైతం

అధిక వడ్డీ ఆశతో పలు శాఖల ఉద్యోగులు సైతం ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో పెట్టుబడులు పెట్టారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఆర్టీసీ ఉద్యోగులు వందలాది మంది లక్షలాది రూపాయల పెట్టుబడులు పెట్టారు. కొందరైతే ఏకంగా రూ.10 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు చెల్లించినట్లు తెలిసింది. కాగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లింగయ్య తెలిపారు.

సార్.. మీరే ఆదుకోండి

ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో డబ్బులు జమ చేసి మోసపోయిన బాధితులు గురువారం యాచారం పోలీసులను ఆశ్రయించారు. దాదాపు 50 మందికి పైగా బాధితులు తాము ఆన్‌లైన్‌లో చెల్లించిన డిపాజిట్ పత్రాలను సీఐ లింగయ్యకు చూపించారు. ఒక్క యాచారం మండలంలోనే రూ.10 కోట్లకు పైగా డిపాజిట్ చేసినట్లు తెలుస్తోంది. పిల్లల పెళ్లిళ్లకు అవసరం వస్తాయనే ఆశతో రూ.లక్షలు జమ చేశామని, మీరు ఆదుకోకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యం అంటూ కన్నీళ్ల పర్యంతమయ్యారు.

నాణ్యమైన మందులే విక్రయించాలి

జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్



డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌ను సన్మానిస్తున్న కిషన్‌రావు

కొడంగల్: జిల్లాలోని మెడికల్ షాపుల్లో నాణ్యమైన మందులే విక్రయించాలని జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ యజమానులను ఆదేశించారు. గురువారం మండలంలోని కొడంగల్, రావులపల్లిలో మెడికల్ షాపులను తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో చేపట్టాల్సిన మార్పుల గురించి యజమానులకు వివరించారు. నాసిరకం మందులు విక్రయించి రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడరాదని సూచించారు. కాల పరిమితి ముగిసిన మందులను మెడికల్ షాపుల్లో ఉంచరాదన్నారు. అనంతరం పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొడంగల్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు విద్యాసాగర్, జిల్లా బాధ్యులు కిషన్‌రావు, ఏపీ పృథ్విరాజ్ తదితదితరులు పాల్గొన్నారు.

ఆసరా కోసం ఆందోళన



సకాలంలో పెన్షన్లు అందడం లేదంటూ ఆందోళన చేస్తున్న వృద్ధులు, దివ్యాంగులు

- హస్నాబాద్‌లో లబ్ధిదారుల ధర్నా
- పోలీసుల హామీతో శాంతించిన ఆందోళనకారులు

కొడంగల్: మండల పరిధిలోని హస్నాబాద్, ఆలేడు గ్రామాలకు చెందిన ఆసరా పింఛన్ లబ్ధిదారులు గురువారం డబ్బుల కోసం ఆందోళన నిర్వహించారు. మహబూబ్‌నగర్- కొడంగల్ రహదారిపై ధర్నా చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆసరా పెన్షన్లు సకాలంలో రావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. డబ్బులు ఇవ్వడంలో సంబంధిత సిబ్బంది ఐదారు నెలలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నెలలో కేవలం ఒకటి, రెండు రోజులు మాత్రమే ఇచ్చి వెళ్లిపోతున్నారని ఆరోపించారు. దీంతో గ్రామంలోని సగం మందికి కూడా డబ్బులు అందడం లేదన్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి బాధితులతో మాట్లాడారు. సకాలంలో డబ్బులు ఇచ్చేలా చూస్తామని హామీ ఇవ్వడంతో లబ్ధిదారులు ఆందోళన విరమించారు. ఈ అంశంపై సదరు సిబ్బందిని వివరణ కోరగా.. ప్రభుత్వం నుంచి సకాలంలో డబ్బులు రావడం లేదన్నారు. బ్యాంకు నుంచి డబ్బు తెచ్చిన వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామని స్పష్టంచేశారు.

సమయాన్ని వృథా చేయొద్దు

- ప్రణాళికాబద్ధంగా చదివితేనే మెరుగైన ఫలితాలు
- జిల్లా విద్యాధికారి రేణుకాదేవి
- బంట్వారం మోడల్ స్కూల్‌లో ఆకస్మిక తనిఖీ



పదో తరగతి విద్యార్థులను ప్రశ్నిస్తున్న డీఈఓ



టీచర్‌తో విద్యార్థులకు లెక్కలు చెప్పిస్తున్న డీఈఓ

బంట్వారం: వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున సమయాన్ని వృథా చేయకుండా, ప్రణాళికబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ రేణుకాదేవి సూచించారు. బంట్వారం మోడల్ స్కూల్‌ను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పలువురితో బోర్డుపై లెక్కలు చేయించారు. అక్కడే ఉన్న మ్యాథ్స్ టీచర్‌ను పిలిచి విద్యార్థులకు ఎక్స్‌ప్లెయిన్ చేయించారు. స్టూడెంట్స్ సమాధానాలపై డీఈఓ సంతృప్తి వ్యక్తం చేశారు. సమయం వృథా చేయకుండా వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. అల్పాహారం అందిస్తున్నారా.. లేదా..? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

తీర్మానాలు తప్పని సరి

పాఠశాల నిర్వహణ ఖర్చులకు సంబంధించి ఎస్ఎంసీ తీర్మానం తప్పని సరిగా ఉండాలని డీఈఓ రేణుకాదేవి చెప్పారు. ప్రిన్సిపల్ సరళాదేవితో మాట్లాడుతూ.. పాఠశాలకు మంజూరైన నిధులు, ఖర్చు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఎస్ఎంసీ ప్రొసీజర్ ప్రకారమే పనులు చేపట్టాలని ఆదేశించారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరలో కమిటీ మీటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంఈఓ చంద్రప్ప ఉన్నారు.

క్లుప్తంగా

'మెపా' జిల్లా అధ్యక్షుడిగా రామాంజనేయులు


రామాంజనేయులు


వెంకటయ్య

వికారాబాద్ అర్బన్: మెపా (ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) జిల్లా అధ్యక్షుడిగా శేరి రామాంజనేయులు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా దుద్యాల వెంకటయ్య ముదిరాజ్ నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త గుట్ట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్, ఉపాధ్యక్షుడు బీ సంజీవన్ వారికి గురువారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శేరి రామాంజనేయులు, దుద్యాల వెంకటయ్య మాట్లాడారు. తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ, మండల స్థాయి కమిటీలు వేసి ముదిరాజ్‌లను ఐక్యం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ముదిరాజ్‌లను బీసీ -డీ నుంచి బీసీ -ఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు. ఇందుకు అవసరమైన పోరాటం చేసేందుకు ముదిరాజ్‌లను సిద్ధం చేస్తామని వారు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి


పవన్‌కుమార్(ఫైల్)

పరిగి: రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన బీజాపూర్ జాతీయ రోడ్డుపై లక్నాపూర్ గేట్ సమీపంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తాన్‌పూర్‌కు చెందిన కమ్మరి మానయ్య, స్వరూప దంపతుల పెద్ద కుమారుడు పవన్‌కుమార్(26) నగరంలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. కరోనా సమయం నుంచి ఇంటి వద్ద నుంచే విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి 11 గంటలకు విధులు ముగించుకొని టీ తాగేందుకు బయటికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. చేతికందిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబంలో శోకసంద్రంలో మునిగిపోయింది. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు తెలుగు రాష్ట్రాల్లో మాదే అధికారం

- బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ధీమా
- ఈశాన్యంలో విజయంపై సంబరాలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఈశాన్య రాష్ట్రాల ప్రజలు నరేంద్రమోదీ నాయకత్వానికే మళ్లీ పట్టం కట్టారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల మున్సిపాలిటీలోని బొంగ్లూర్‌లో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో బీజేపీకి అనుకూలంగా ఫలితాలొచ్చాయని, మోదీ పాలనను మెచ్చి జనం ఆదరించారని పేర్కొన్నారు. దేశమంతా నరేంద్రమోదీ హవా కొనసాగుతోందని చెప్పారు. బీజేపీకి ఈశాన్య రాష్ట్రాలు అండగా నిలిచాయని తెలిపారు. ఇక కమ్యూనిస్టుల పని అయిపోయిందని చెప్పారు. గల్లీ, ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగైందని, త్వరలో జరిగే ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాల్లో కాషాయం జెండా ఎగురవేస్తానమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేరుతుందన్నారు. తెలంగాణ రాక ముందు మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను కుటుంబ పాలనలో అప్పుల తెలంగాణగా మార్చేశారని మండిపడ్డారు. కాగా, ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ గెలుపొందిన సందర్భంగా ఆదిబట్ల మున్సిపాలిటీలోని బొంగ్లూర్‌లో విజయోత్సవ సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

హైనా దాడిలో దూడ మృతి

ఆమనగల్లు: కడ్తాల మండల కేంద్రం సమీపంలోని వ్యవసాయ క్షేత్రం వద్ద బుధవారం రాత్రి హైనా దాడిచేసి లేగదూడను చంపింది. కడ్తాల్‌కు చెందిన ఇప్పల కృష్ణయ్య గురువారం ఉదయం తన వ్యవసాయ పొలంలోని పశువుల పాక వద్దకు చేరుకోగా ఒక లేగదూడ చనిపోయి ఉండటాన్ని గుర్తించాడు. వెంటనే సమాచారం అందుకున్న కడ్తాల సర్పంచ్ గూడురి లక్ష్మీనర్సింహారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం అటవీశాఖ అధికారులకు తెలియజేయడంతో బీట్ ఆఫీసర్ విజయభాస్కర్‌రెడ్డి, పశువైద్యాధికారి డా.భానునాయక్ వచ్చి పరిశీలించారు.

'ట్రేడ్' మాయాజాలం

వేలల్లో వ్యాపారాలు, వందల్లో ట్రేడ్ లైసెన్సులు

- మున్సిపల్ ఆదాయానికి భారీ గండి
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

పరిగి: ఆదాయ వనరులను మున్సిపల్ శాఖ విస్మరిస్తుండడంతో లక్షల్లో ఆదాయాన్ని కోల్పోతోంది. ఎక్కడైన వ్యాపార, వాణిజ్య సంస్థలు తమ కార్యకలాపాలు నిర్వహించాలంటే తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలి. చిన్న కిల్లీ కొట్టు మొదలుకొని పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్, కార్పొరేట్ స్థాయి సంస్థల వరకు కచ్చితంగా ట్రేడ్ లైసెన్సులు పొందాలి. కానీ చాలా వ్యాపార సముదాయాలు లైసెన్సులు ఉండడం లేదు. ఏటా చెల్లించాల్సిన ఫీజులు చెల్లించకుండా దర్జాగా వ్యాపారం చేసుకుంటున్నారు. షాపింగ్ మాల్స్, ఆస్పత్రులు, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాళ్లు, కార్పొరేట్ స్కూళ్లు, ఇతర విద్యా సంస్థలు, పెట్రోల్ బంకులు, సినిమా థియేటర్లు నిర్వహించే వారు ట్రేడ్ లైసెన్సులు తీసుకోవడం లేదు. కొంత మంది తీసుకున్నా రెన్యూవల్ చేయించుకోవడం లేదు. దీంతో మున్సిపాలిటీ ఆదాయానికి భారీ గండి పడుతోంది.

కేవలం 600ల ట్రేడ్ లైసెన్సులే..

పరిగి పట్టణ కేంద్రంలో వేల సంఖ్యలో వ్యాపార సముదాయాలు ఉన్నా కేవలం 600 మంది మాత్రమే ట్రేడ్ లైసెన్సులు పొందారు. అందులో దాదాపు 100కు పైగా లైసెన్సులను రెన్యూవల్ చేసుకోలేదు. నిబంధనల ప్రకారం గల్లీలోని పాన్ షాపు మొదలుకొని పెద్ద పెద్ద పరిశ్రమల వరకూ విధిగా లైసెన్స్ తీసుకోవాలి. మున్సిపల్ నిబంధనల ప్రకారం ఏరియా, షాపు విస్తీర్ణాన్ని బట్టి ఫీజు నిర్ణయిస్తారు. సింగిల్, డబుల్ లైన్ రోడ్డు పరిధిలో వ్యాపారాలను బట్టి విలువ లెక్కించి ఫీజులు కట్టాల్సి ఉంటుంది. 20 ఫీట్ల రోడ్డులో ఒక చదరపు అడుగుకు కనీస ఫీజు రూ. 3, డబుల్ రోడ్డు రూ. 4, హోటళ్లు, ఆస్పత్రులకు రూ. 6 చొప్పున ఫీజు వసూలు చేస్తారు. పరిశ్రమల ఫీజు మరోలా ఉంటుంది.

నామమాత్రంగా రెన్యూవల్

ట్రేడ్ లైసెన్స్ జారీ ఒక ఏడాదికి మాత్రమే ఉంటుంది. గడువు ముగిసిన తరువాత రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో తాత్కాలిక, శాశ్వత విభాగాల్లో లైసెన్సులు ఉంటాయి. సీజన్ వరకే జరిగే వ్యాపారాలు, ప్రమాదకర పరిశ్రమలకు తాత్కాలిక లైసెన్సులు, మిగతా వాటికి శాశ్వత లైసెన్సులు జారీ చేస్తారు. ప్రతి రోజూ రూ. లక్షల్లో లావాదేవీలు సాగించే వందల చదరపు అడుగుల్లో విస్తరించిన విద్య, వైద్యం, హోటళ్లు, రెస్టారెంట్లు, షో రూంలు, వస్త్ర, ఎలక్ట్రికల్స్ షాపులు నిర్వహించే వారు లైసెన్సులు తీసుకోవడం లేదు. చిన్న వ్యాపారులే ప్రతి ఏటా ట్రేడ్ లైసెన్సులు పొందుతున్నారు.



పరిగి మున్సిపల్ కార్యాలయం

"నోటీసులు జారీ చేస్తున్నాం



ట్రేడ్ లైసెన్సులు తీసుకోకుండా వ్యాపారాలు చేస్తున్న వారికి నోటీసులు జారీ చేస్తున్నాం. మున్సిపల్ ప్రత్యేక బృందంతో వ్యాపారులకు అవగాహన కల్పించి లైసెన్సులు పొందేలా చూస్తున్నాం. లైసెన్సు లేకుండా వ్యాపారం చేస్తే చర్యలు తీసుకుంటాం. ప్రతి ఒక్క వ్యాపారీ విధిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి.

– శ్రీనివాసన్, మున్సిపల్ కమిషనర్, పరిగి

పార్వతమ్మకు మెరుగైన వైద్యసేవలందిస్తాం

- డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ప్రదీప్‌కుమార్
- చేతి వేళ్లు స్పర్శ కోల్పోయిన ఘటనపై విచారణ

తాండూరు టౌన్: కాన్పు కోసం వచ్చిన గర్భిణి వైద్యం పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహించడంతో ఆమె చేతి వేళ్లు స్పర్శ కోల్పోయిన ఘటనపై వైద్యాధికారులు బుధవారం విచారణ జరిపారు. కుల్కచర్ల మండలం బొంరెడ్డిపల్లికి చెందిన పార్వతమ్మ గత నెల 17న తాండూరులోని మాతా శిశు ఆస్పత్రిలో కాన్పు కోసం వచ్చింది. సిబ్బంది ఇచ్చిన ఇంజక్షన్ కారణంగా ఆమె కుడి చేతి వేళ్లు స్పర్శ కోల్పోయాయి. బాధితురాలి భర్త శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు బుధవారం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ ఆ రోజు విధుల్లో ఉన్న వైద్య సిబ్బంది తప్పిదంపై ఆరా తీశారు. స్టాఫ్ నర్సుతో పాటు స్టూడెంట్ నర్సు నిర్లక్ష్యం వల్లే పార్వతమ్మ చేతి వేళ్లు స్పర్శ కోల్పోయినట్లు నిర్ధారించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే పార్వతమ్మకు మెరుగైన వైద్యం అందేలా చూస్తామని తెలిపారు.

భక్తి మార్గంతోనే ముక్తి


హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: భక్తి మార్గంతోనే ముక్తి లభిస్తుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి 36వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష తులసీ అర్చన, చండీ హోమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే దంపతులు, డిప్యూటీ మాజీ స్పీకర్ కొప్పుల హరీశ్వర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కొప్పుల అనిల్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. పట్టణానికి చెందిన పూరి వెంకటేశం రూ. 10లక్షల విలువ చేసే మకరతోరణం చేయించి స్వామి వారికి సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అనుసరించాలని సూచించారు. భక్తితోనే ముక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్, జెడ్పీటీసీ హరిప్రియ దంపతులు ప్రవీణ్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

- అంగన్‌వాడీల సమస్యలు తీర్చకుంటే సమ్మె ఉధృతం
- సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లేశం


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

అనంతగిరి: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లేశం, అధ్యక్షుడు మైపాల్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 24 గంటల సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్‌హెచ్‌టీఎస్ యాప్‌ను పూర్తిగా రద్దు చేయాలన్నారు. ఐసీడీఎస్ ప్రైవేటీకరణను ఆపాలన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ సెంటర్లుగా గుర్తించాలన్నారు. ఐసీడీఎస్‌కు బడ్జెట్‌లో నిధులు పెంచాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన వేతనాలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి అద్దెలు, గ్యాస్ బిల్లులు, టీఏ, డీఏలు వెంటనే చెల్లించాలని కోరారు. అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలను వెంటనే తీర్చాలని లేకుంటే సమ్మెను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు భారతి, కార్యదర్శి నర్సమ్మ, నాయకులు లక్ష్మి, సుజాత, అరుణాదేవి, సరళ, సంతోష, అంజమ్మ, భాగ్యలక్ష్మి, చంద్రకళ, రేణుక, నిర్మల, ప్రమీలా, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నడ్డి విరుస్తున్న ప్రభుత్వాలు

- కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు మేలు
- ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్
- తాండులో హాత్ సే హాత్ జోడో యాత్ర


తాండూరు 13వ వార్డులో పర్యటిస్తున్న రమేష్ మహరాజ్, నాయకులు

తాండూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలతో ప్రజలకు వాత.. మరో వైపు రాష్ట్రంలో కరంటు బిల్లుల మోత మోగిస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నాయని ఏఐసీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ తాండూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమేష్ మహరాజ్ విమర్శించారు. గురువారం పట్టణంలోని 13వ వార్డులో హాత్ సే హాత్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ వరాల శ్రీనివాస్‌రెడ్డి తోపాటు పార్టీ నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. కాంగ్రెస్ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు.. అధికారంలోకి వస్తే చేపట్టే పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా రమేష్ మహరాజ్ మాట్లాడుతూ.. దేశ భావి భారత ప్రధాని రాహుల్ గాంధీనే అని అన్నారు. ఆయన్ను ప్రధాన మంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. సోనియా గాంధీ వల్లే తెలంగాణ వచ్చిందన్నారు. మనమంతా కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో దొరలు పాలిస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ఏ ఒక్కరికీ ఇల్లు రాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి పేదల సొంతింటి కలను సాకారం చేస్తామన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పాలనలో నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. గ్యాస్ సిలిండర్ ధర పెంచి సామాన్యులపై ఆర్థిక భారం వేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, బషీరాబాద్ మాజీ జెడ్పీటీసీ రాకేష్ మహరాజ్, కౌన్సిలర్లు ప్రభాకర్‌గౌడ్, మమత, మధుబాల, మాజీ వైస్ చైర్మన్ అలీం, పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ హబీబ్‌లాల, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బంటు వేణుగోపాల్, నాయకులు ఉత్తమ్‌చంద్, జనార్దన్ రెడ్డి, నర్సింహులు, నర్సిరెడ్డి, రియాజ్, బషారత్, ఖాలేద్, సైఫుల్లా, భీంశంకర్ పాల్గొన్నారు.

నరోత్తంరెడ్డికి మాతృ వియోగం

మోమిన్‌పేట: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎన్ నరోత్తంరెడ్డి తల్లి నీలమ్మ(90) మృతి చెందారు. గురువారం మండలంలోని చీమల్‌దరిలో నిర్వహించిన ఆమె అంత్యక్రియలకు ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టరు మెతుకు ఆనంద్, చేవేళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, బీసీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు శుభప్రద్‌పటేల్, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బీ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు నర్సింలు గుప్తా, అంజిరెడ్డి, విఠల్, బక్కారెడ్డి, జనార్దన్‌రెడ్డి హాజరై ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

తాండూరులో ట్రైనీ ఐఏఎస్ పర్యటన

తాండూరు రూరల్: పట్టణంలో ట్రైనీ ఐఏఎస్ సంచిత్ గంగ్ వార్ పర్యటించారు. 2021 బ్యాచ్‌కు చెందిన సంచిత్ శిక్షణ పూర్తి కావడంతో తెలంగాణ క్యాడర్‌కు కేటాయించారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు గురువారం తాండూరు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం గౌతపూర్ శివారులోని నర్సరీ, శ్మశానవాటికను పరిశీలించారు. ఆగస్టు నెల వరకు క్షేత్రస్థాయిలో అన్ని శాఖలపై పట్టుసాధించేందుకు ఫీల్డ్ వర్క్ చేస్తున్నట్లు ట్రైనీ ఐఏఎస్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని కొత్తగడి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ మండలం ఎర్రవల్లికి చెందిన నవాత్‌రెడ్డి, రవి వికారాబాద్ నుంచి తమ గ్రామానికి బైక్‌పై వెళ్తున్నారు. కొత్తగడి వద్ద బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇంట్లో నగలు, నగదు చోరీ

కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా దొంగ చేతివాటం

పరిగి: అందరూ పడుకున్న తరువాత దొంగ ఇంట్లోకి చొరబడి చేతి వాటం ప్రదర్శించాడు. ఈ సంఘటన మండలంలోని నస్కల్ గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్సై విఠల్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన కుర్వ మల్లేష్, కుటుంబ సభ్యులు రాత్రి భోజనం చేసి నిద్రించారు. గురువారం ఉదయం లేచి చూడగా బెడ్ రూంలోని బీరువా తాళం తీసి ఉండడం గుర్తించారు. అందులోని రెండు తులాల బంగారం, 25 తులాల వెండి ఆభరణలు, రూ. 10వేల నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శోభాయమానంగా పల్లకీ సేవ


స్వామివారిని ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తజనం

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం మరికల్ – కిష్టంపల్లి గ్రామాల పరిధిలోని కోటచింతల బసవేశ్వర స్వామి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. మరికల్ గ్రామం నుంచి స్వామివారిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో మరికల్, కిష్టంపల్లి సర్పంచులు పాండు రంగయ్య, శ్రీనివాస్, నాయకులు, భక్తులు నర్సింహారెడ్డి, రామ్మోహన్ శర్మ, ఉదయ్, భానుప్రకాశ్, రాజు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేయాలి

ఎంపీ రంజిత్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

బంట్వారం: బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని చేవేళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. గురువారం బంట్వారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ఎమ్మెల్యే ఆనంద్‌తో కలిసి మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు మనస్పర్థలు వీడి సమన్వయంతో పని చేయాలన్నారు. అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే అధికారమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి


సమావేశంలో మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

- హక్కుల కోసం పోరాటం చేస్తా
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి

తాండూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఒక్క అవకాశం ఇస్తే హక్కుల సాధనకు పోరాటం చేస్తానని కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం తాండూరు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ శాఖల్లో ఏ ఉద్యోగ సంఘాలకు ఎమ్మెల్సీ స్థానం లేదన్నారు. కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే చట్ట సభల్లో అవకాశం ఉందన్నారు. అయితే గతంలో చట్ట సభల్లోకి వెళ్లిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు సమస్యలు పరిష్కరించడం కంటే అధిక సమస్యలను తెచ్చి పెట్టారన్నారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే కేవలం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం మాత్రమే పని చేస్తానన్నారు. ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వరాల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు బంటు వేణుగోపాల్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మేకల మృతి


కుక్కల దాడిలో చనిపోయిన మేకలు

కుల్కచర్ల: కుక్కల దాడిలో మూడు మేకలు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. రాంనగర్ గ్రామానికి చెందిన కే శ్రీనివాస్ మధ్యాహ్న సమయంలో తన మామిడి తోటలో మేకలను కట్టేసి భోజనం చేయడానికి వెళ్లారు. తిరిగి వచ్చే సరికి మేకలపై కుక్కలు దాడి చేస్తున్న సంఘటనను చూసి దగ్గరకు వెళ్లి చూశాడు. అప్పటికే మేకలు మృతి చెందాయి. మూడు మేకలు చనిపోవడంతో రూ. 30వేల వరకు నష్టం జరిగిందని బాధిత రైతుల తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమా?

- పీసీసీ కార్యదర్శి వీర్లపల్లి శంకర్


విద్యార్థి కుటుంబాన్ని పరామర్శిస్తున్న శంకర్

షాద్‌నగర్: కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడటం తగదని పీసీసీ కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని పద్మావతీ కాలనీలో నివాసం ఉంటున్న విద్యార్థి సాత్విక్ కుటుంబ సభ్యులను గురువారం కాంగ్రెస్ పార్టీ నేతలు పరామర్శించారు. విద్యార్థి తల్లిదండ్రులు నాగుల రాజు, అలివేలుతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శంకర్ విలేకరులతో మాట్లాడుతూ... కార్పొరేట్ విద్యా సంస్థల చేతుల్లో ప్రభుత్వం కీలుబొమ్మగా మారిందని ధ్వజమెత్తారు. ర్యాంకుల పేరుతో విద్యార్థులను చిత్రహింసలకు గురిచేసి వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. చదువుల్లో ఎంతో చురుగ్గా ఉండే సాత్విక్.. శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యం వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డారని, సాత్విక్ మృతి ఘటనకు సంబంధించిన కేసు విషయంలో ఎలాంటి న్యాయ సహకారం అందించేందుకైనా తమ పార్టీ సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. విద్యార్థి ఆత్మహత్యకు కారకులైన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని, కళాశాల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రైవేట్ విద్యా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో కార్పొరేట్ విద్యా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్, కొమ్ము కృష్ణ, సయ్యద్ ఖదీర్, సుదర్శన్, అందె శ్రీకాంత్, అశోక్ తదితరులు ఉన్నారు.

ఈదులపల్లిలో దొంగల హల్‌చల్

రెండు ఆలయాల్లో చోరీ

- ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లిన దొంగలు

నందిగామ: మండల పరిధిలోని ఈదులపల్లిలో బుధవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామంలోని హనుమాన్ దేవాలయం, శివాలయంతో పాటు ఓ ఫాంహౌస్‌లో దొంగతనానికి పాల్పడి విలువైన ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. ఇన్‌స్పెక్టర్ రామయ్య కథనం ప్రకారం.. గ్రామ సమీపంలో ఉన్న శివాలయం, గ్రామంలో ఉన్న హనుమాన్ దేవాలయంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు దొంగతనానికి పాల్పడ్డారు. శివాలయం గుడి తాళం పగులగొట్టి అమ్మవారి పుస్తెలు, కాలిమెట్టెలు, హుండీలోని నగదును అపహరించారు. అలాగే.. హనుమాన్ దేవాలయంలో హుండీని ఎత్తుకెళ్లి అందులోని నగదును తీసుకొని సమీపంలోని జామ తోటలో ఖాళీ హుండీని పడేసి వెళ్లినట్లు రామయ్య తెలిపారు. వీటితో పాటు గ్రామ సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో కూడా చోరీ జరిగింది. ఈ ఘటనలలో రూ.30 వేల విలువ చేసే బంగారు ఆభరణాలు, రూ.15 వేల నగదును ఎత్తుకెళ్లిపోయినట్లు గ్రామస్తుడు శ్రావణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపారు.